క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎస్ మాధవ్‌ను హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శనివారం శాలువాతో సన్మానించారు. అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నాయకుడు ముత్తిరెడ్డి కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



నర్సంపేట : పట్టణంలోని శ్రీ భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికిపైగా ప్రజలు రాగా హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన అజరా ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, జనరల్ చెకప్ చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ముడుంబై రామానుజచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేంశెట్టి శ్రీనివాస్, సభ్యులు రామగోని సుధాకర్, చింతల నిరంజన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన చెంగల సురేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్ట్ సభ్యులు శనివారం రూ.20 వేల సాయం అందజేశారు. తొలుత సురేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ స్థానిక ప్రతినిధులు నాతి గణేశ్, బాల్నె రామచంద్రుడు, గడ్డం రాజు, సట్ల అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి..



రాయపర్తి : మండలంలోని ఏకే తండాకు చెందిన హలావత్ సూర్యనాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని సంకీర్తన హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా ఆయనకు వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ శనివారం రూ.5 వేల సాయం అందించింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సమకూర్చిన రూ.5 వేల నగదును ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. తొలుత ఫౌండేషన్ ప్రతినిధులు సూర్యనాయక్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఫౌండేషన్ ప్రతినిధి గజవెల్లి ప్రసాద్, నాయకులు సంకినేని ఎల్లస్వామి, చందు సతీశ్, హలావత్ రమేశ్, మూడు రవీందర్, మాలోత్ వసుందర్, మునావత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన బొజ్జ నారాయణ ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడైన కేయూ ఎస్సై రవీందర్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. తొలుత నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవినాయక్, నాయకుడు అఫ్సర్, జక్కి శ్రీకాంత్, కొండేటి బాలకృష్ణ, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన బాదావత్ బాలు శనివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ నర్సంపేట నియోజకవర్గ నాయకుడు, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ బాలునాయక్, చెన్నారావుపేట మాజీ వైస్‌చైర్మన్ తొగరు చెన్నారెడ్డి, అమీనాబాద్ సొసైటీ డైరెక్టర్ దొంతరబోయిన కొమ్మాలు, మాజీ సర్పంచ్‌లు జరుపుల మారి భిక్షం, మంద శంకర్, జరుపుల ప్రవీణ్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో సస్యరక్షణ కీలకం

● మండల వ్యవసాయ అధికారి నాగరాజు



నెక్కొండ : జిల్లాలో ఏటా పత్తి సాగు పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో పత్తి సాగు మొదటి స్థానంలో ఉండగా వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలు తదనంతర స్థానాల్లో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తగా పలు చోట్ల తొలి కలుపు తీస్తున్నారు. పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతోపాటు అధికారుల సూచనలు పాటించడం కీలకం. తద్వారానే అధిక దిగుబడి సాధించగలరని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పత్తి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్యంపై మండల వ్యవసాయ శాఖ అధికారి ఎగిడి నాగరాజు సూచనలు, సలహాలు అందించారు.

అవగాహన తప్పనిసరి

పత్తి సాగు చేసే రైతులు రసాయాలను మోతాదుకు మించి వినియోగిస్తుండడంతో పెట్టుబడి భారంగా మారుతోంది. సరైన అవగాహన లేకపోవడంతో రైతులు అవసరానికి మించి రసాయనాలు వినియోగిస్తూ నష్టపోతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో రైతులు అధికారుల సూచనల మేరకే రసాయనాలు వినియోగించాలి. సమగ్ర ఎరువుల వినియోగంతో ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించొచ్చు. ప్రస్తుతం పత్తి మొలక, కలుపు దశలో ఉన్న క్రమంలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలి.



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న ఏఈఓ వసంత

సూక్ష్మ పోషకాల వాడకం

జింక్ : జింక్ లోపం కారణంగా ఆకులు, ఈనెలు ఆకుపచ్చగా, మధ్యభాగం పసుపు పచ్చగా మారుతుంది. ఆకులు చిన్నగా మారి ముడత పడతాయి. మొక్క గిడసబారుతుంది. జింక్ లోప నివారణ కోసం లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజులకోసారి పిచికారీ చేయాలి. అలాగే రెండేళ్లకోసారి ఎకరాకు 20 కిలోల ముడి జింక్ సల్ఫేట్ వేస్తే భూసారం పెంపొందుతుంది.

మెగ్నీషియం : మెగ్నీషియం లోపంతో ముదురు ఆకుల అంచులు పసుపు రంగుకు మారి, ఆకులు ఎర్రబడి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్ కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

బోరాన్ : బోరాన్ లోపంతో పూలు చిన్నగా మారి పూత, కాయ, పిందెలు రాలి, మొక్క గిడసబారి కాండంపై పగుళ్లు ఏర్పడే అవకాశాలున్నాయి. దీని నివారణకు లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాన్ కలిపి 7–10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

ఎరువుల్లో సమగ్రత తప్పనిసరి

పత్తి సాగు చేసే భూముల్లో ఏటా ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువు వేసి కలియదున్నాలి. రసాయన ఎరువులైతే సాధారణ రకాలకు ఎకరాకు 36 కిలోల నత్రజని, 18 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేయాలి. హైబ్రిడ్ రకాలకు ఎకరాకు 48 కిలోలు నత్రజని, 21 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ అందించే ఎరువులు వేయాలి.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌ను పెంచడంపై కాంగ్రెస్ నాయకులు నరుకుడు వెంకటయ్య, ఎద్దు సత్యం, పోశాల వెంకన్న గౌడ్, కమ్మగోని ప్రభాకర్, మేదరి సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ధీకొండ ఉపేందర్, బొమ్మడి సోమయ్య హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదించడాన్ని చారిత్రాత్మకంగా అభివర్ణించారు. రిజర్వేషన్లు పెంచడానికి నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికల వైపు అడుగులు వేయడం విప్లవాత్మక నిర్ణయమన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చేసిన ×జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాల్సి అన్న డిమాండ్‌ను దేశంలో తొలిసారిగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుండడం గర్వకారణమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన మాట మేరకు మంత్రివర్గం ఆమోదించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటయ్య, నాయకులు

కాంగ్రెస్ కమిటీల ఎన్నిక



నర్సంపేట మండల కార్యవర్గం

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ నర్సంపేట మండల కమిటీని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కత్తి కిరణ్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా పెండ్యాల మధు, బానోత్ రాము, ఉపాధ్యక్షులుగా బొజ్జ ఐల్లయ్య, దొడు భాస్కర్, కోశాధికారిగా దూపటి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా పసునూటి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా అజ్మీర రాజు, యర్నం మోహన్, భూక్య శివ, బానోత్ ఈర్య, కార్యవర్గ సభ్యులుగా అరెల్లి నరేశ్, బుడిగొండ భిక్షపతి, జరుపుల భద్రు, బానోత్ రమేశ్, పోలేపల్లి భిక్షపతి, ధరావత్ రాజు ఎన్నికయ్యారు.

చెన్నారావుపేట కమిటీ..

నర్సంపేట : కాంగ్రెస్ చెన్నారావుపేట మండల అధ్యక్షుడిగా సిద్దన రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల రాములు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా మొగిలి వెంకట్‌రెడ్డి, తప్పెట రమేశ్, ఉపాధ్యక్షులుగా పెరుమాండ్ల మల్లారెడ్డి, బోడ గుగులోతు ఈర్య, కార్యదర్శులుగా బోడ భూక్య మోహన్ నాయక్, చెవ్వ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చిప్ప లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా మాదారపు చరణ్ ఎన్నికయ్యారు.

నల్లబెల్లి కమిటీ..

నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఒల్లె నర్సయ్యపల్లికి చెందిన చిట్యాల తిరుపతిరెడ్డి ఎన్నికయ్యాడు. వండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, కడుదూరి కట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ మోహన్, ఉపాధ్యక్షులుగా పెంతల కొమురారెడ్డి, ఆంగోత్ పూల్‌సింగ్, కార్యదర్శులుగా జెట్టి రామ్మూర్తి, జిల్లా మునేందర్ తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వరుసగా ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుపతిరెడ్డిని నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీ పని చేస్తుందని స్పష్టం చేశారు.

దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మల్లంపల్లికి చెందిన చుక్క రమేశ్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, ఇంగోళి రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా అజ్మీర రవీందర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా కామ శోభన్‌బాబు, నల్ల వెంకటయ్య, సహాయ కార్యదర్శిగా అమ్మ రోహిత్, ప్రచార కార్యదర్శిగా కూరతోట సురేశ్, కోశాధికారిగా జంగిలి రవి, సభ్యులుగా ఉస్సేన్‌పల్లి విరాట్, గిన్నె స్వామి, రేవూరి వెంకట్‌రెడ్డి, యార రవి, నల్ల యాదవరెడ్డి, ఎర్ర ఆదిరెడ్డి, వేములపల్లి ఓదెలు, పుప్పాల శ్రీను, పరుపాటి ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం



చార్ట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఎన్‌సీసీ కేడెట్లు సోషల్ సర్వీస్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు తయారు చేసిన చార్ట్‌ల ప్రదర్శనను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ప్లాస్టిక్ కవర్లకు బదులు కాగితపు సంచులు వినియోగించాలని చెప్పారు. తద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కాగితపు సంచులు నీటి, భూమి, వాయు కాలుష్య నివారణకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులు పేపర్ బ్యాగులు వాడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడతామని విద్యార్థులతో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజొద్దీన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, నాగరాజు, రాజేశ్, రవీందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, రాజేందర్, పూర్ణిమ, విజయ్, గౌతమ్, క్రాంతికుమార్, రామ్మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు భవానీ చంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

● ఏఐఎఫ్‌డీఎస్ సహాయ కార్యదర్శి నాగరాజు

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు విమర్శించారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమాఖ్య ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం మొదలై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలు యథాతథంగానే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు పనులు చేయించడం లేదని, విద్యార్థులు ఇబ్బంది పడుతునానరని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య బాలికల విభాగం కన్వీనర్ గణిపాక బిందు, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు రవీందర్‌రాజు

దామెర : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని మహాత్మా జ్యోతిరావుపూలే, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రచురించిన విధంగా పెండింగ్ డీఏలను ఏకకాలంలో విడుదల చేయాలన్నారు. పీఆర్సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతులను చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల పని వేళలను వెంటనే మార్చాలని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల అధ్యక్షుడు సుదర్శన్, బీసీ గురుకుల ఉపాధ్యాయుల జిల్లా కన్వీనర్ అశోక్, టీఎస్ యుటీఎఫ్ మైనారిటీ వింగ్ అధ్యక్షుడు భిక్షపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటితే ఉద్యోగం ఖాయం

● 'వాగ్దేవి' ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్

మామునూరు : ఫార్మసీ విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే ఉద్యోగావకాశాలు ఖాయమని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ప్రముఖ ఫార్మా సంస్థ, డివీస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ శనివారం జరిగింది. డ్రైవ్‌లో రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి 200కు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కమల్ యాదవ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు దేశ, విదేశాల్లో ఎక్కువగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రావుల శివకుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆత్మకూరు : తమపై దాడిచేసి తన కోడలును కిడ్నాప్ చేశారంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన ఇర్సడ్ల సదానందం శనివారం ఇంట్లో ఉండగా కారులో ఏడాకుల సౌందర్య, ధనలక్ష్మితోపాటు మరో ముగ్గురు వచ్చి దాడి చేశారు. సాయిశృతిని బలవంతంగా తీసుకెళ్లారు. ఈ ఘటనపై సదానందం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు



దామెర : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆటోనగర్‌కు చెందిన వంగ భరత్‌సాయి సులువుగా డబ్బు సంపాదించాలని ఛత్తీస్‌గఢ్ నుంచి గంజాయి తీసుకొచ్చి బస్టాండ్ ఏరియాల్లో విక్రయిస్తున్నాడు. మిగిలిన గంజాయిని విక్రయించేందుకు శనివారం మండలంలోని ల్యాదెళ్ల సమీపంలోని సిరి క్రషర్ వైపు సంచిలో తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా గంజాయి విక్రయించేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో అతని వద్ద ఉన్న 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.27,500 ఉంటుందని వెల్లడించారు. భరత్‌సాయిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే ధ్యేయం

● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్స్, గ్రామ కోఆర్డినేటర్ల సమీక్షా సమావేశానికి హామ్యానాయక్ అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని చెప్పారు. ఎన్నికల్లో అవలంబించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. మండల కోఆర్డినేటర్లు పెద్దగాని సోమయ్య, జినుగు సురేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఏఎంసీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు బాటలు వేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

'ఇందిరమ్మ' పేరుతో మట్టిదందా..?

● అధిక ధరలకు లబ్ధిదారులకు విక్రయాలు

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మండల కేంద్రంలో మట్టి దందా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మండలంలోని అన్ని గ్రామాల్లో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చెరువుల నుంచి ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు మట్టి తరలించుకునే అవకాశాన్ని సైతం ప్రభుత్వం కల్పించింది. ఇదే అదునుగా మండల కేంద్రంలో కొందరు అక్రమార్కులు రాజకీయ నాయకులు, అధికారుల దన్నుతో స్థానిక పెద్ద చెరువు రిజర్వాయర్ నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మట్టి తరలిస్తూ ఒక్కో ట్రిప్పునకు రూ.5 వేలు చొప్పున దండుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా గతంలో ఒక్కో ట్రిప్పును వెయ్యి రూపాయలకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు రూ.4 వేలకు విక్రయించిన దళారులే ప్రస్తుతం కొద్ది రోజులుగా చెరువు రిజర్వాయర్ నుంచి ఉచితంగా తీసుకొచ్చి రూ.5 వేలకు అమ్ముకుంటున్నారంటూ పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కనీసం ఒక్కో ట్రిప్పునకు రూ.4 వేలు చొప్పున తీసుకున్నా తమకు కొంత ఊరట కలిగేదని లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా మట్టి అందజేసి సహకరించాలన్న డిమాండ్ ఉంది.

మట్టి తరలింపుపై ఆంక్షల్లేవు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు చెరువుల నుంచి మట్టి తరలించుకోవడంలో ఆంక్షలు లేవు. ప్రభుత్వమే లబ్ధిదారులు మట్టి తరలించుకోవడాన్ని అనుమతించింది. ట్రాక్టర్లలో, టిప్పర్లలో మట్టిని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి తరలించుకునే విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– ఎర్ర ప్రశాంత్, ఏఈ, ఐబీ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చెరువుల నుంచి మట్టి తరలింపు విషయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తప్పవు. ట్రాక్టర్లు, టిప్పర్లలో లబ్ధిదారులు కాకుండా దళారులు మట్టి తరలిస్తూ పెద్దమొత్తంలో డబ్బు దండుకోవడం సరికాదు. మండల కేంద్రంలో మట్టి దందా సాగుతోందన్న ప్రచారంపై విచారణ చేస్తాం.

– బోగం ప్రవీణ్, ఎస్సై

ప్రైవేట్ పాఠశాలలపై ఆరోపణలు తగదు

● ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగార్జున్‌రెడ్డి

నెక్కొండ : ప్రైవేట్ పాఠశాలపై ఆరోపణలు తగదని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (టస్మా) జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తక్కువ ఫీజులకే విద్యార్థులకు బోధన అందిస్తున్నాయని చెప్పారు. స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కాగా అధిక ధరలకు విక్రయిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. కొన్ని విద్యార్థి సంఘాలు అత్యుత్సాహంతో పాఠశాలలపై దాడులు చేస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ప్రైవేట్ స్కూళ్లపై ఆరోపణలు చేయొద్దని, ఆధారాలుంటే చూపాలని సూచించారు. పాఠశాలల్లో యాజమాన్యలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే, అక్రమాలకు పాల్పడితే అసోసియేషన్ ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఎవరైనా అవాస్తవాలను ప్రచారం చేస్తే ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమానులు చల్లా యాకూబ్‌రెడ్డి, శ్రీరాముల నాగేశ్వర్‌రావు, గోపు థామస్‌రెడ్డి, అశోక్‌కుమార్, మరళీకృష్ణ, అంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

నాయకుడి చొరవతో పారిశుద్ధ్య పనులు

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఒకటో వార్డు కమిటీ ఇన్‌చార్జ్ లక్కర్సు రమేశ్ చొరవ తీసుకోవడంతో మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని ఆ వార్డు పరిధిలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ దారిలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడాన్ని రమేశ్ గమనించి స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ కమిషనర్, ఏఈల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు జేసీబీతో పనులు నిర్వహించారు. సైడ్ కాల్వ తీయించి నీరు వెళ్లేలా పనులు చేయించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



మురుగునీటి తొలగింపును పర్యవేక్షిస్తున్న రమేశ్

ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ గౌడ్

● బీఆర్ఎస్ నాయకుడు రంగు కుమార్

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ కోరారు. మండలంలోని మనీశ్‌తండాలో మాజీ సర్పంచ్ భూక్య భద్రూ నాయక్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి కుమార్ గౌడ్ అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కి హామీలు అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేస్తున్న పథకాలను, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, చందు రామ్, లాలూ నాయక్, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.